క్లుప్తంగా

బూచేపల్లికి ఘన సన్మానం



బూచేపల్లిని సన్మానిస్తున్న ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల

పామూరు: వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆదివారం రాత్రి సీఎస్‌పురం మండలానికి వెళ్తూ మార్గమధ్యంలో పామూరు వచ్చారు. ఈసందర్భంగా ఆయనకు వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్, స్థానిక నాయకులు జాతీయ రహదారిపై ఘనస్వాగతం పలికారు. అనంతరం బూచేపల్లిని ఘనంగా సన్మానించారు. జెడ్పీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు గుంటక తిరుపతిరెడ్డి, పార్టీ నాయకులు కల్లూరి రామిరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్.సెంట్రింగ్‌చాంద్‌బాషా, గట్లా విజయభాస్కర్‌రెడ్డి, అంబటి కొండారెడ్డి, సన్నపురెడ్డి ప్రకాష్‌రెడ్డి, రంగారెడ్డి, కటికల వెంకటరత్నం, గంజి రవీంద్రారెడ్డి ఉన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



కోవిలంపాడులో వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి, దద్దాల

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని కోవిలంపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు గోను నారాయణరెడ్డి సరస్వతి కుమారుడు అఖిల్‌కుమార్‌రెడ్డి, భవ్యారెడ్డి వివాహానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, కనిగిరి ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణయాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, వైఎస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పులి లక్ష్మి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, జెడ్పీటీసీలు గుంటక తిరుపతిరెడ్డి, యం.కస్తూరిరెడ్డి, సన్నపురెడ్డి ప్రకాష్‌రెడ్డి, గోను చంద్రశేఖర్‌రెడ్డి, కస్తూరిరెడ్డి, మైనారిటీసెల్ నాయకులు షేక్.బుజ్జి, ఇతర నాయకులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలు

హనుమంతునిపాడు: మండలంలో వేర్వేరుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..తిమ్మారెడ్డిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన వేపపోగు బాబు బైక్‌పై వస్తుండగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. అదే విధంగా కొత్తూరు గ్రామానికి చెందిన పానుగోటి నారాయణరెడ్డి కొండారెడ్డిపల్లి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా బైక్ తిరగబడటంతో తీవ్ర గాయాలుకావడంతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

మర్రిపూడి: మండలంలోని గుండ్లసముద్రం శివారులో పేకాట ఆడుతున్నట్లు సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆదివారం ఆకస్మిక దాడులు చేశారు. దాడిలో ఏడుగురు జూదరులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద రూ.6,910 నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులను సోమవారం జడ్జి ముందు హాజరుపరుస్తామన్నారు.

కనులపండువగా లక్ష్మీ నృసింహస్వామి కల్యాణం

మర్రిపూడి: దసర పండుగను పురస్కరించుకొని పృథులగిరిపై వేంచేసిన ఆదిలక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామి కళ్యాణం శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు నారాయణం తిరుమలాచార్యులు, మారుతీ చార్యులు ఆధ్వర్యంలో స్వామి కల్యాణం జరిపించారు. ఆదిలక్ష్మీ సమేత లక్ష్మీనృసింహస్వామికి పూలమాలలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామి కల్యాణాన్ని తిలకించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకొని ఉత్సవ విగ్రహమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పల్లకిపై ఉంచి మేళతాళాలతో ఊరేగించారు.

రూ.30 వేల ఆర్థిక సాయం

పామూరు: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన కోలనీడు నారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాలు తీవ్రంగా గాయపడి మంచానికే పరిమితమయ్యాడు. బాధితునికి మానవత స్వచ్ఛంద సేవాసంస్థ తరుపున రూ.5 వేలు, ఇతరుల నుంచి విరాళాలుగా సేకరించిన మొత్తం రూ.30 వేలను ఆదివారం స్వచ్ఛంద సంస్థ కన్వీనర్ కల్లూరి రామిరెడ్డి, అధ్యక్షుడు మెడబలిమి మునయ్యలు బాధితుడు నారాయణ నివాసానికి వెళ్లి అందజేశారు. తోట రమేష్, రంగారెడ్డి, వెండిదండి వెంకటేశ్వర్‌రెడ్డి, తూరెడ్డి వెంకటేశ్వర్లు, వై.వెంకటసుబ్బయ్య, యం.తిరుపతిరెడ్డి, ఎ.సత్యనారాయణరెడ్డి, ఎ.మాల్యాద్రి, మిరికాల నారాయణ, పలువురు పాల్గొన్నారు.

వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలి

సీఎస్‌పురం(పామూరు): వాహనదారులు విధిగా లైసెన్స్ కలిగి ఉండాలని ఎస్సై ఆర్.సుమన్ అన్నారు. సీఎస్‌పురంలో ఆదివారం రాత్రి వాహనాలను ఆయన తనిఖీచేశారు. ఈసందర్భంగా ద్విచక్ర వాహనాలకు, వాహన చోదకుల లైసెన్స్‌లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోల్లో నిబంధనలమేరకు మాత్రమే ప్యాసింజర్‌ను ఎక్కించుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

అధ్వానం.. ఆలకించేవారేరి..?



చెత్త, మెడికల్ వ్యర్థాలతో నిండిపోయిన రోడ్డు



వ్యర్థాలతో నిండి కాల్వలో నిలచి ఉన్న మురికి నీరు

- డంపింగ్ యార్డ్‌లను తలపిస్తున్న రహదారులు
- అపరిశుభ్రంగా కొండపి–పెద్దకళ్లగుంట రహదారి
- కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోని అధికారులు
- వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తుల గగ్గోలు

కొండపి: కొండపిలోని రోడ్లు డంపింగ్ యార్డులను తలపిస్తున్నాయి. ఓ పక్క అడదా దడపా కురుస్తున్న వర్షాలతో నీరు నిల్వ చేరి వ్యాధులు ప్రబలి ప్రజలు భయాందోళనకు గురవుతుంటే..మరో పక్క అధ్వాన పారిశుధ్య ప్రజలకు మరిన్ని రోగాలకు కారణమవుతోంది. అటు వైపుగా నిత్యం అధికారులు వెళుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎందుకింత నిర్లక్ష్యం..?

కొండపి నుంచి జాళ్లపాలెం వెళ్లే రోడ్‌లో చెత్త చెదారం నిండి మురికికూపంగా మారింది. పంచాయతీలో సేకరించిన చెత్తా చెదారాన్ని జాళ్ల రోడ్డు పక్కనే వేయడంతో చెత్తంతా రోడ్డుమీదకు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీనికి తోడు పందులు, కుక్కలు చెత్తలోకి వెళ్లి చెత్తను రోడ్డుకు మీదకు నెట్టడంతో పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. పందులు, కుక్కలకు ఆ చెత్తా చెదారం నివాసంగా మారడంతో ఆ ప్రాంతమంతా భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అధికారులు చెత్త పట్టించుకోకపోవడంతో రోజుల తరబడి నిల్వ ఉండి కుళ్లి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ వారు గ్రామంలో సేకరించిన చెత్తను ఊరికి దూరంగా జన సంచారం లేని ప్రాంతాల్లో వేయాల్సి ఉండగా పారిశుధ్య కార్మికులు రోడ్ల పక్కనే వేయడం వల్లే ఈ పరిస్థితి దాపురించింది. ఎవరైనా రాజకీయ నాయకులు, ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం హడావుడిగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారని స్థానికులు వాపోతున్నారు. సందట్లో సడేమియా అన్నట్లు కొందరు మెడికల్ వ్యర్థాలను సైతం అక్కడే వేస్తున్నారు. సిరంజీలు, బాక్సులు, ల్యాబ్ పరికరాలు అక్కడే వేయడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు.

రోడ్డు మీద వర్షం నీరు

కొద్దిపాటి వర్షానికి జాళ్లపాలెం రోడ్డులో వర్షం నీరు నిలిచిరాకపోకలకు ఇబ్బందిగా ఉంది. అదే ప్రదేశంలోని మురికి కాల్వలోని నీరు ప్రవహించకపోవడంతో కాల్వ నిండి మురుగు నీరు రోడ్డుపైకి వస్తుంది. మురుగు నీరు అక్కడే నిల్వ ఉండడంతో పందులు రాత్రివేళలో దోమల ప్రభావం అధికంగా ఉండి దోమ కాటుతో వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని ప్రజలు వాపోతున్నారు.

కలెక్టర్ ఆదేశించినా పట్టించుకోరా..?

మూడు నెలల క్రితం కలెక్టర్ కొండపి గ్రామంలో పర్యటించినప్పుడు అక్కడ ఉన్న చెత్తను వెంటనే తొలగింగించి డంపింగ్ యార్డ్ కేంద్రానికి తరలించి చెత్తను అక్కడ వేయకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అప్పటి తహసీల్దార్ మరుగున పడిన డంపింగ్ యార్డ్‌ను పునఃప్రారంభించడానికి ప్రయత్నాలు చేశారు. అయితే తహసీల్దార్ బదిలీ కావడంతో ఆ పనులు నిలిచిపోయాయి. గత నెల 25వ తేది కలెక్టర్,మంత్రి కొండపి వస్తున్నారని తెలుసుకున్న అధికారులు ఆఘమేగాల మీద అక్కడ ఉన్న చెత్తను జేసీబీతో తొలగించారు. ఇప్పుడు మరలా యధాస్థితికి వచ్చింది. మంత్రి, కలెక్టర్,అధికారులు వస్తేనే పారిశుద్య పనులు పట్టించుకుంటున్నారని ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

వైభవంగా విజయదశమి వేడుకలు



భైరవకోనలో విశిష్ట అలంకరణలో త్రిముఖ దుర్గాదేవి అమ్మవారు



వల్లూరులో ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మతల్లి



నాగిరెడ్డిపాలెంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో అమ్మవారు



బంగారుచీర అలంకరణలో వాసవీ మాత మూల విగ్రహమూర్తి

పామూరు: దసరా శరన్నవరాత్రి వేడుకలు శనివారంతో ముగియగా ఆదివారం అమ్మవార్ల గ్రామోత్సవం, వసంతోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఈసందర్భంగా పామూరు వల్లీ అమ్మవారి గ్రామోత్సవాన్ని ఆలయ ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అమ్మవారి పారువేట వైభవంగా నిర్వహించారు. వాసవీమాత ఆలయంలో అమ్మవారు బంగారు చీర అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ యేల్చూరి బాలకొండలరావు, సేగు కృష్ణయ్య, దరిశి మస్తాన్‌రావు, నారాయణస్వామి ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, వెంకట్రావు, గుర్రం వెంకటేశ్వర్లు, పసుపులేటి రఘురాం, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, మెంటా బాలరాఘవులు, పందిటి హరీష్, పెసల నరసింహారావు పాల్గొన్నారు.

టంగుటూరు: మండలంలో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, తులసి పూజలు, కుంకుమ పూజలు ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్య పాల్గొని అమ్మవారి దర్శించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ రమేష్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. టంగుటూరు పోలీసు స్టేషన్‌లో సింగరాయకొండ సీఐ చావా హచరత్తయ్య, ఎస్సై నాగమల్లీశ్వరరావు సిబ్బందితో కలిసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, ఆయుధ పూజ నిర్వహించారు.

పొన్నలూరు: మండలంలో విజయదశమి వేడుకలను శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక రామాలయం, అంకమ్మతల్లి గుడి, నాగిరెడ్డిపాలెం పోలేరమ్మతల్లి దేవాలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి. చివరి రోజున అమ్మవారు రాజరాజేశ్వరీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చింది.


కొండపి: దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శివాలయం, ప్రసన్నాంజనేయస్వామి, కొండేపమ్మ, నాగర్పమ్మ , పోలేరమ్మ తల్లి దేవాలయం, సాయిబాబా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు రాజరాజేశ్వరి అలంకరణలో దర్శనమిచ్చారు.

కనిగిరి రూరల్: విజయ దశమి సంబరాలు కనిగిరిలో అంబరాన్ని అంటాయి. పట్టణంలో పాటు, వివిధ మండలాల్లో గల వివిధ ఆలయాల్లో విశిష్ట పూజలు జరిగాయి. శని,ఆదివారాల్లో ఆలయాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి(బన్నీ), జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి పలు ఆలయాల్లో దేవతామూర్తులకు విశిష్ట పూజలు చేశారు. స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయంలో కళ్యాణోత్సవాలు, నందన మారెళ్ల గుడిలో, కనకదుర్గమ్మగుడిలో, అంకాళమ్మ గుడిలో, లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానాల్లో జరిగిన విజయ దశమి ప్రత్యేక పూజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక షిరిడీ సాయి బాబా దేవస్థానంలో సాయిబాబా వారి 106వ మహా సమాధి పుణ్య తిథి కార్యక్రమం అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది.

సీఎస్‌పురం(పామూరు): దసరా శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ముగిశాయి. ప్రముఖ పుణ్య క్షేత్రం భైరవకోనలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో స్వామికి అభిషేకం, విశిష్ట పూజల, గోపూజ ఘనంగా నిర్వహించారు. పూజ ల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చోడా రవిచంద్రారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ శేషవస్త్రంతో సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, ముప్పాళ్ల అనంతరాజు, భక్తులు పాల్గొన్నారు.



కనిగిరి ఆలయంలో ప్రత్యేక పూజలు



కె.ఉప్పలపాడు శివాలయంలో..



వల్లీ భుజంగేశ్వర స్వామి గ్రామోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఈఓ నరసింహబాబు



మిట్టపాలెంలో గోపూజ నిర్వహిస్తున్న చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకులు

15న జిల్లాస్థాయి ఖోఖో జట్ల ఎంపిక

కనిగిరి రూరల్: మండలంలోని కంచర్లవారిపల్లిలో జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఈ నెల 15న ఉమ్మడి జిల్లా(ప్రకాశం, బాపట్ల) జూనియర్ బాలబాలికల, సీనియర్ పురుషుల, మహిళల ఖోఖో జట్ల ఎంపిక జరుగుతుందని ఖోఖో సంఘ జిల్లా కార్యదర్శి బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. జూనియర్ విభాగంలో బాల, బాలికలకు వయస్సు, ఎత్తు, బరువు, అన్ని కలిపి 250 పాయింట్స్ మించరాదని తెలిపారు. 2006 నవంబర్ 21 తర్వాత జన్మించిన వారు అర్హులని, వచ్చేటప్పుడు ఆధార్‌కార్డు, సర్టిఫికెట్లు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈనెల 25,26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లాలోని కాణిపాకంలో జరిగే 33వ రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. సీనియర్ విభాగంలో ఎవరైనా పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారు నవంబర్ చివరి వారంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివవరించారు. ఆసక్తి కల్గిన క్రీడా కారులు 98482 19080 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

వెండి కిరీటం సమర్పణ

లింగసముద్రం: స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువైన వెంకటేశ్వరస్వామికి గ్రామానికి చెందిన వెంకటేశ్వర బేకరీ యజమాని రాయళ్ళ ప్రసాద్ రూ.1.30 లక్షల విలువైన వెండి కిరీటాన్ని నవరాత్రుల చివరి రోజైన శనివారం ధర్మకర్త అడపా రంగయ్య, ప్రధాన అర్చకులు వెల్లటూరి రాధాక్రిష్ణకు అందజేశారు. ఈ కిరీటాన్ని స్వామివారికి అలంకరించారు. ప్రసాద్, యామిని సరస్వతి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రాగాయకుంట చెరువుగా మార్చి నీటి సమస్య పరిష్కరించాలి

టంగుటూరు: రాగాయకుంట 26 ఎకరాలను చెరువుగా మార్చి టంగుటూరు గ్రామ మంచి నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలి సీపీఎం నేతలు డిమాండ్ చేశారు. సీపీఎం టంగుటూరు గ్రామ శాఖ మహాసభ టి.రాము అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వే గేటు వద్ద సీపీఎం జెండాను ఎగుర వేశారు. సభకి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు మాట్లాడుతూ టంగుటూరు గ్రామ ప్రజలు మంచి నీళ్ల లేక చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. పాలేరు, మూసి వాగుల నుంచి నీళ్లు సముద్రంలోకి వృథాగా పోతున్నా టంగుటూరుకి శాశ్వత మంచి నీటి వసతిని ఏర్పాటు చేసుకోలేక పోవడం పాలకుల నిర్లక్ష్యమన్నారు. సీపీఎం మండల కన్వీనర్ వి. మోజెస్ మాట్లాడారు. సీపీఎం గ్రామ శాఖ కార్యదర్శిగా టంగుటూరి వెంకటరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

కేజీబీవీల్లో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు

సీఎస్‌పురం(పామూరు): సర్వశిక్ష ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేజీబీవీల్లో ఈనెల 15వ తేదీలోగా ఖాళీగా ఉన్న బోధనేతర పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ రాజాల కొండారెడ్డి తెలిపారు. సీఎస్‌పురం కేజీబీవీలో ఒక ప్రధాన వంట మనిషిపోస్టు ఖాళీగా ఉందన్నారు. అదేవిధంగా మండలంలోని శీలంవారిపల్లె టైప్–4 కేజీబీవీలో చౌకీదార్, హెడ్‌కుక్, అసిస్టెంట్ కుక్ పోస్టు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న మహిళలు తమ దరఖాస్తులను ఎంఈఓ కార్యాలయంలో అందజేయాలన్నారు. 15వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా అందిన దరఖాస్తులు మాత్రమే పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎంపికైన వారికి నెలకు రు.15 వేల గౌరవవేతం చెల్లిస్తామని తెలిపారు. దరఖాస్తుదారులు 18 నుంచి 42 ఏళ్ల లోపు వయసు వారై ఉండాలని, స్థానికులకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.

కిక్కు..లక్కు..!

- కనిగిరిలో 19 షాపులకు 389 దరఖాస్తులు
- కనిగిరి రూరల్ దుకాణాలకు అనాసక్తి..
- పామూరులో దుకాణాలకు తీవ్ర పోటీ
- కిక్కు లక్కు ఎవరికో తేలేది నేడే..



కనిగిరి ఎక్సైజ్ శాఖ కార్యాలయం

కనిగిరి రూరల్: అధినేత మంత్రమా.. అధికార తంత్రమా తెలియదు కానీ.. సిండికేట్ల పంచాయితీలు, వ్యాపారుల తర్జన భర్జనలు అనంతరం చివరి రెండ్రోజుల్లో కనిగిరిలో మద్యం దరఖాస్తులు బాగా నమోదైయ్యాయి. కనిగిరి ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో గతంతో కంటే రెండు షాపులు పెరిగాయి. అయితే ఆ రెండు షాపులు కనిగిరి మండల రూరల్ గ్రామాల్లో పెంచినట్లు అధికారులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీతో స్వీకరించిన మద్యం షాపుల దరఖాస్తుల్లో కొన్ని దుకాణాలకు తీవ్ర పోటీ జరగ్గా.. కొన్నింటికి వ్యాపారులు అనాసక్తి చూపారు. నూతన మద్యం దుకాణాలు దక్కించుకునేందుకు అధికార పార్టీ నేతలు, దళారులు(సిండికేట్లు) ఎత్తులకు పై ఎత్తులు వేస్తూ దరఖాస్తులు సమర్పించారు.

రంగంలోకి కొత్త ముఖాలు..

ఈ నెల 9వ తేదీ వరకు 155 నుంచి 160 దరఖాస్తులు మాత్రమే రాగా.. తేది మార్పుల తర్వాత ఒక్కసారిగా మద్యం దరఖాస్తులు పెరిగాయి. చివరి రోజు 11వ తేదినే ఆన్‌లైన్ లేదా, ఆఫ్‌లైన్ ద్వారా సుమారు 108 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. టీడీపీ నేతలు కొందరు వారి బినామీలతో కూడా దరఖాస్తులు చేయించారు. విచిత్రం ఏమిటంటే మద్యం వ్యాపారం కనీసం అవగాహన లేని.. కొందరు వ్యక్తులు సామాజిక వర్గాల వారీగా పది మంది కలిసి పోతే ఒక్కొక్కరికి రూ.10 వేలు నష్టం..అదృష్టం వరిస్తే.. 7నుం చి 10 రెట్లు ఆదాయం పొందవచ్చనే అత్యాశతో బరిలోకి దిగారంటే అతిశయోక్తి కాదు. కనిగిరి రూరల్ మండలంలోని షాపు నంబర్ 123, 124లకు 12 దరఖాస్తులు, నంబర్ 125 కు 10 దరఖాస్తులు వచ్చాయి.

పామూరులో పోటా పోటీ..

మద్యం నూతన పాలసీ తీరు పామూరు మండల అధికార పార్టీ నేతల మధ్య తీవ్ర పోటీకి కారణమైందిగా తెలుస్తోంది. ఇక్కడ కూటమి పార్టీలోని రెండు సామాజికవ వర్గాల నేతలు, టీడీపీ పార్టీలోని ఒకే సామాజిక వర్గానికి చెందిన రెండు వర్గాలకు చెందిన వారు భారీగా దరఖాస్తులు చేశారు. నియోజకవర్గంలోనే పామూరు మండలానికి చెందిన నాలుగు షాపులకు 30నుంచి 35 వరకు దరఖాస్తులు వచ్చాయి.

ఇక్కడ ఒకే.. అక్కడి పరిస్థితి ఏంటో.. ?

అధికార పార్టీ నేతలు, అధికారులు చేపట్టిన మంత్రాంగం కనిగిరి రూరల్ ఏరియాలో సక్సెస్ అయినా.. పామూరులో వికటించే పరిస్థితి ఉంది. ఇప్పటికే కనిగిరి టౌన్‌లోని ప్రధాన కూడళ్లలో నడుస్తున్న రెండు షాపులను ఎవరూ పెట్టుకోవద్దని.. అక్కడ షాపుల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్యతో పాటు, ఉద్యోగుల, మహిళల రాకపోకలకు ఇబ్బంది కల్గుతుందని.. ముఖ్యనేత మాటగా అధికారులు మద్యం దరఖాస్తుదారులకు అనధికార ఆదేశాలిచ్చారు. అయితే మిగతా సెంటర్లలో ప్రస్తుతం పట్టణానికి చెందిన ఆరు షాపులు పెట్టుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రూరల్‌లోని మూడు షాపులకు కచ్చితంగా సిండికేట్ చేస్తామనే ఒప్పందంతోనే దరఖాస్తులు వేయించినట్లు తెలిసింది. ఎందుకంటే మద్యం షాపు ఏర్పాటుకు ఒక్క కనిగిరి మండలంలోని అడ్డరోడ్డు(ఉస్తుంవారిపల్లి) జంక్షన్ మాత్రమే అనుకూలం. మిగతా ఎక్కడా పెట్టినా మద్యం షాపులు నడిచే పరిస్థితి లేదు. లేదంటే తాళ్లూరు జంక్షన్ పాయింట్‌లో పెట్టినా.. అంతంత మాత్రం వ్యాపారం జరిగే అవకాశాలుంటాయని దరఖాస్తులదారుల ఆలోచన. దీంతో కచ్చితంగా అడ్డ రోడ్డులో రెండు షాపులు పెట్టినా.. మూడవ షాపు బయపెట్టాలి దీంతో అక్కడ దరఖాస్తుదారుల్లో వివాదాలు జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలో దరఖాస్తుదారులంతా టీడీపీ పార్టీకి చెందిన వారే కావడంతో అధికార పార్టీ నేతలు, అధికారులు లాటరీ ద్వార దక్కించుకున్న ముగ్గురిని కచ్చింతగా ×మద్యం సిండికేట్లు×గా మార్చాలి. అందుకు అధికారులు, అధికార నేతలు ముందస్తు ఒప్పందాలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఈ వ్యవహారం పామూరు మండలంలో జరిగే పరిస్థితి లేదు. ఇక్కడ ఒక్కో దుకాణానికి 30 వరకు దరఖాస్తులు వచ్చాయి. లాటరీ వచ్చిన తర్వాత అధికార తంత్రం ఉపయోగించి సిండికేట్లు చేస్తారా.. లేదా అనేది వేచి చూడాల్సి ఉంది. సోమవారం లాటరీ విధానంలో లక్కు తగిలిన వారికి షాపులు కేటాయించనున్నారు.

కనిగిరి ఎక్సైజ్ సర్కిల్‌లో వచ్చిన మద్యం దరఖాస్తులు

షాపు నంబర్	టౌన్/ మండలం	వచ్చిన దరఖాస్తులు
117	కనిగిరి టౌన్	19
118	కనిగిరి టౌన్	21
119	కనిగిరి టౌన్	17
120	కనిగిరి టౌన్	19
121	కనిగిరి టౌన్	17
122	కనిగిరి టౌన్	17
123	కనిగిరి రూరల్	12
124	కనిగిరి రూరల్	12
125	కనిగిరి రూరల్	10
126	సీఎస్‌పురం	20
127	సీఎస్‌పురం	20
128	పామూరు	35
129	పామూరు	34
130	పామూరు	29
131	పామూరు	30
132	పీసీపల్లి	19
133	పీసీపల్లి	18
134	వెలిగండ్ల	20
135	వెలిగండ్ల	20
మొత్తం దరఖాస్తులు		389

వివాహ వేడుకల్లో దద్దాల

పామూరు: స్థానిక అనీల్‌గార్డెన్స్‌లో జరిగిన సిద్దవటం మహేంద్రారెడ్డి వెంకట వనజ వివాహ వేడుకలో వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి దద్దాల నారాయణ పాల్గొని దంపతులను ఆశీర్వదించారు. అనంతరం మండంలోని పాటోలువారిపల్లిలో ఉప్పుటూరి శివశంకర్‌యాదవ్, మౌనిక వివాహ, రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ షేక్.చాంద్‌బాషా, ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు, యాటా రాఘవేంద్ర, ఇర్రి కృష్ణారెడ్డి, చెనికల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని జంగంవారిపల్లె గ్రామంలో వైఎస్సాఆర్‌సీపీ నాయకులు చోడ రాజశేఖర్‌రెడ్డి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో దద్దాల నారాయణ పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. కోదండరామస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, చోడ రవిచంద్రారెడ్డి, దుగ్గిరెడ్డి జయరెడ్డి, బత్తుల దేవరాజు, కత్తులపల్లి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పామూరులో వధూవరులను ఆశీర్వదిస్తున్న దద్దాల నారాయణ

పాకల బీచ్‌లో పర్యాటకుల సందడి



పాకల బీచ్‌లో పర్యాటకుల సందడి

సింగరాయకొండ: పాకల బీచ్‌లో ఆదివారం పర్యాటకులు పోటెత్తడంతో తీరం జనసంద్రంగా మారింది. బీచ్‌కు మండలంలోని ప్రజలతో పాటు ఇతర మండలాల ప్రజలు సముద్రస్నానాల కోసం భారీగా తరలివచ్చారు. విద్యార్థులకు దసరా సెలవులతో పాటు ఆదివారం కూడా కావడంతో బీచ్‌లో పర్యాటకులు వచ్చేవారు వెళ్లేవారితో సందడిగా మారింది. బీచ్‌లో అలల ఉధృతి బాగా ఉన్నా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుస్తు జాగ్రత్తలు చెప్పే మెరైన్ పోలీసులు బీచ్‌లో కార్యాలయానికి పరిమితమయ్యారని స్థానికులు వాపోయారు. బీచ్‌లో మద్యం తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన మెరైన్ పోలీసులు చర్యలు చేపట్టిన దాఖలాలు లేవని మందుబాబులు యథేచ్ఛగా మద్యం తాగారని మహిళలు ఆరోపిస్తున్నారు. తీరంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్ పోలీసులు విధులను సక్రమంగా నిర్వహించాలని పర్యాటకులు కోరుతున్నారు.



బీచ్ వద్ద మద్యం తాగుతున్న మందుబాబులు

పాకల బీచ్‌లో అమ్మవారి విగ్రహాల నిమజ్జనాలు



కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేస్తున్న భక్తులు

సింగరాయకొండ: దసరా నవరాత్రులు ముగియడంతో పాకల బీచ్‌లో ఆదివారం ఆదివారం కనకదుర్గమ్మ విగ్రహాల నిమజ్జనాలు కోలాహలంగా నిర్వహించారు. తొలుత అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం కనులపండువగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అమ్మవారి విగ్రహాలను తీసుకువచ్చి నిమజ్జనం చేశారు.

48 మద్యం బాటిళ్లు పట్టివేత



మద్యం బాటిళ్లను పట్టుకున్న పోలీసులు

వెలిగండ్ల: మండలంలోని మొగళ్లూరుకు చెందిన ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను స్థానిక ఎస్సై మధుసూదన్‌రావు ఆదివారం పట్టుకున్నారు. అక్రమంగా తరలిస్తున్న 48 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, మొగళ్లూరుకు చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.